# మునిశర్మ మౌనవ్రతం

**అది శ్రావణం - ఆకాశంలో కొన్ని పిల్ల మేఘాలు అటూ ఇటూ పరుగులు పెడ్తున్నాయి. కొన్ని నల్ల మేఘాలు మాత్రం దూరం నుంచి వర్షాన్ని ప్రసవిస్తానంటూ భారంగా గజగమనంతో నిండు చూలాలిలా పడమట నుంచి వస్తున్నాయి.**

అది సంధ్యా సమయం! సూర్యుడు వేడి తగ్గి వాడి తగ్గి మబ్బుల చాటున దోబూచు లాడుతున్నాడు! చిన్న చిరుగాలి గోదావరి మీద నుంచి వీస్తూ ఆహ్లాదం కలిగిస్తోంది. ధవళేశ్వరం బ్యారేజి వైపు 'గాలి షికారు'కు అంటే దాన్ని 'ఈవెనింగ్ వాక్' అనవచ్చునేమో! బయలు దేరాడు మునిశర్మ. ఒక ప్రక్క వర్షం వస్తుందేమోనని అనుమానిస్తూనే సాయంత్రం వేళ ఇంట్లో ఉండలేక రోడ్డున పడ్డాడు.

అలా నడుచుకుంటూ వెళ్తూంటే చల్లటి గాలి శరీరాన్ని అలవోకగా కౌగలిస్తూ మురిపిస్తూంటే కవి హృదయం పులకరించింది! అలాగని మునిశర్మ కవిత్వం ఏమీ రాయలేదు. కాని రచనలు మాత్రం చేశాడు. చేస్తున్నాడు.

ఇక మునిశర్మ వ్యక్తిగతానికి వస్తే అతడు మేష్టరు గిరీ చేసి రిటైరయ్యాడు. ఏదో ప్రభుత్వం వారి ధర్మమా అని కొద్దో గొప్పో పెన్షను వస్తుంది. పిల్లా పాపా పెరిగి రెక్కలొచ్చి ఎవరి మానాన వారు దూర దూరంగా ఎగిరి పోయారు. జీవిత భాగస్వామిని ఈ జీవితాన్ని వదిలి వెళ్ళిపోయింది. దాంతో మునిశర్మ ఒంటరివాడై తనకున్న చిన్న కుటీరంలో తలదాచుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు. తెలుగు భాష మీద అభిమానంతో తనదైన రీతిలో శైలిలో ఏదో కొంత రచనా వ్యాసంగం కావిస్తున్నాడు. కాలక్షేపం అవాలి కదా!

సర్వీసులో ఉండగానే తన ఇంటిపేరూ, పేరూ కలిపి పెద్దదయిందని సింపుల్‌గా 'మునిగంటి' అనే ఇంటిపేరులోని 'ము'- నిరంజన శర్మ అనే పేరులోని 'ని' కలిపి 'శర్మ'తో జతచేసి 'మునిశర్మ'గా కుదించాడు. అలాగే తనపేరును రాసుకోవడం అలాగే

## చాడ రమణమూర్తి


సంతకం పెట్టటం చేసేవాడు. అదే రానురాను అందరికీ పరిచయం అయింది. ఇక ఆ పేరుతోనే రచనా పరంపర సాగించాడు. ఏవో ఒకటీ అరా రచనలు వెలుగు చూసినా, మిగతావి పాపం అంధకారంలోనే ఉండి పోయాయి! అదంతా వేరే కథ! ఇది ఇలా ఉండగా-

మునిశర్మ ఉద్యోగరీత్యా పిల్లలకు పాఠాలు చెప్పడం, చెప్పగా చెప్పగా ప్రతీదీ వ్యాఖ్యానిస్తూ మాట్లాడటం అలవాటయింది. పని చేస్తున్న రోజుల్లోనే స్కూల్లో 'బోరుశర్మ'గా ప్రసిద్ధి పొందాడు. పరిచయస్తులు కూడా ఇతడు కన్పించగానే వీలయినంతగా తప్పుకుని ప్రక్క సందుల్లోకి జారుకునేవారు! ఎవరైనా పొరపాటున ఎదురుపడితే వారికి ఆయుర్దాయంలో కనీసం ఒక గంట తగ్గిపోయిందన్న మాటే! ఈ 'బోరుశర్మ' పేరు తనదాకా అనేకసార్లు రావటంతో చాలా సిగ్గు అన్పించింది. ఇలా అతిగా మాట్లాడటం తగ్గించుకోవాలని శతవిధాలా ప్రయత్నించాడు. కాని అబ్బే!.. 'నైజగుణానికీ, బట్టతలకీ మందులేదు' అన్నట్లు అంత వేగంగా తగ్గుతుందా?

రిటైరయ్యాక, భార్య పోయాక మునిశర్మ తన స్వంత ఊరు వచ్చి తన చిన్న ఇంట్లో ఒంటరిగా కాలక్షేపం చేయసాగాడు. రోజూ సాయంత్రం గాలి షికారు అలవాటు చేసుకున్నాడు. అలాటి గాలి షికారులో ఒక సాయంత్రం ధవళేశ్వరం బ్యారేజి వైపు వెళ్తూ ఒక పిట్టగోడ వద్ద కూర్చుని చల్లగాలి ఆస్వాదిస్తున్నాడు. అప్పుడు వచ్చింది ఒక మెరుపులాంటి ఆలోచన. చాలా బాగుంది అనుకున్నాడు. అదేమిటనగా అసలు తన పేరులోని 'ముని' శబ్దం ఉంది కదా! ఆ పేరును సార్థకం చేసుకుంటేనో?... ఎందరో మహానుభావులూ, యోగులూ, స్వాములూ బాబాలూ పాటించేది ఆ వ్రతమే కదా!.. మహాత్మాగాంధీగారు వారానికి ఒకరోజు ఆ వ్రతం పాటించేవారు! ఇక అవతార్ మెహర్‌బాబా గారయితే ఎన్నో సంవత్సరాలు పాటించినదీ ఈ వ్రతమే! అదే మౌనవ్రతం! ఇది వారానికి ఒక రోజైనా పాటిస్తే తనకు ఎంతో మేలు! ఇది ఆరోగ్యానికీ-మనసుకీ చాలా మంచిదంటారు. అందుచేత వారానికి ఒకరోజు మౌనం పాటించాలనుకొన్నాడు మునిశర్మ. కాని ఏ వారం పాటిస్తే బాగుంటుంది? ఆఫీసులూ, బ్యాంకులూ, బజార్లూ, పోస్టాఫీసులూ ఉన్న రోజుల్లో పాటిస్తే వ్రతం సాగకపోవచ్చు! అందుచేత ఆదివారమే దీనికి సరైన రోజు! అనుకున్నాడు.

* * *

సరే- అని ఒక ఆదివారం నాడు మౌనదీక్ష పాటిద్దామని ముహూర్తం పెట్టుకొన్నాడు. ఆ రోజు ఉదయమే లేచి స్నానాదికాలు ముగించుకుని కాఫీ వగైరాలు పూర్తయేక గంటసేపు ధ్యానముద్రలో మునిగిపోయాడు. బజారుకు కూడా వెళ్ళకూడదనుకున్నాడు. ఇంతలో ఫోను 'గణ గణ' మ్రోగింది! ఇప్పుడేం చెయ్యటం? పోనీ ఎత్తడం మానేస్తే? అనుకుని కొంతసేపు మ్రోగనిచ్చాడు. అది మ్రోగి మ్రోగి ఊరుకుంది. బ్రతికాను అనుకుని ఏదో పుస్తకం తీసి చదవబోయేంతలో మళ్ళీ 'గణ గణ' మ్రోగింది. ఎత్తడం మానేస్తే అది ఎంత అవసరమైన ఫోనో? అని ఆలోచిస్తూ ఫోను



ఎత్తాడు కాని జవాబు చెప్పలేదు! అవతల నుంచి "హలో!.. హలో!.. ఎవరు?.. మునిశర్మా?" అంటూ పదే పదే విన్పించింది. అది తన స్నేహితుడు రాజు గొంతు! ఇక తప్పదని – "హలో!" అన్నాడు.

"ఏమిరా? – ఫోను ఎంత మ్రోగినా పలకవు? ఇంట్లోనే ఉన్నావా? ఫోను ఎత్తి కూడా జవాబు చెప్పవేం?" అంటూ చెడా-మడా వాయించేశాడు! గొంతులో వెలక్కాయ పడ్డట్టు ముక్తసరిగా జవాబు చెప్పాడు. వాడు విశాఖ నుంచి వచ్చి రాజమండ్రి స్టేషన్లో దిగి ఫోను చేశాడట! మరొక గంటలో ప్రత్యక్ష మౌతానన్నాడు!


అమ్మ- బాబోయ్! వాడొస్తే ఇక చంపేస్తాడు! ఈ మౌనం గీనం జాన్తానయ్! అదీ కాక ఫోనులో జవాబు చెప్పక తప్పలేదు కదా! మౌనభంగం ప్రారంభంలోనే అయింది! ఇక మరి ఈ రోజుకు మౌనం లేనట్లే! అనుకుని స్నేహితుని కోసం ఎదురుచూశాడు. వాడు రావటం వస్తూనే మరి నాలుగు అక్షింతలు వెయ్యటం జరిగింది. అప్పుడు తాను–

"అది కాదురా!.. ఇవాళ నుంచి నేను మౌనవ్రతం వారానికో రోజు పాటిద్దామను కొన్నాను. అందుకే ఫోనులో వెంటనే జవాబు చెప్పలేదు." అని నసుగుతూ అన్నాడు.

వాడు ఫకాల్న నవ్వుతూ "ఒరే!.. ఒరే!.. ఏమిటి? నువ్వు మౌనవ్రతమా? ఏదీ మరోసారి చెప్పు!" అంటూ విరగబడి నవ్వాడు. అవును మరి! ఎప్పుడూ వట-వట వాగుతుండే తనలాంటి వాడు మౌనవ్రతం పాటిస్తున్నానంటే నవ్వరా మరి! ఏదోలాగ వాడితో ఆ రోజు గడిచింది. రాజు వెళ్ళిపోయాడు. అప్పట్నించీ మళ్ళీ ఆదివారం కోసం ఎదురు చూస్తూ ఈ సారైనా కచ్చితంగా ప్రారంభిద్దామనుకున్నాడు.

* * *

రెండవ ఆదివారం రానేవచ్చింది. వస్తూ వస్తూ ఏకాదశిని మోసుకొచ్చింది. మునిశర్మ ఏకాదశి ఉపవాసం సంవత్సరాల తరబడి చేస్తున్నాడు.



ఏకాదశినాడు విధిగా దేవాలయానికి వెళ్ళ టం... అతడికి అలవాటు. యథాప్రకారం ఉద యమే లేచి స్నానాదికాలు ముగించుకుని గుడికి బయలుదేరాడు. త్రోవలో కొబ్బరి కాయల దుకాణానికి వెళ్లాడు. వెళ్ళి ఆ కొబ్బరి కాయలు అమ్మేవాడితో కాయ ఖరీదు ఎంతని సౌంజ్ఞ చేశాడు. వాడు దాని ఖరీదు ఏదు రూపాయలన్నాడు. మామూలుగా దాని ధర అయిదు రూపాయల కంటే ఎక్కువ మించదు! కాని ఆ రోజు ఏకాదశి కదా! అని వాడు ధర పెంచాడు. ఇదో దోపిడీ!

ఏమిటో?.. మన వామ పక్షాలవాళ్ళు 'దోపిడీ-దోపిడీ' అని గొంతు చించుకుం టారు!.. మన వ్యవస్థ మీద పెట్టుబడిదారీ విధానం మీద, యాజమాన్యం మీద, ధనవంతుల మీద విరుచుకు పడతారు- కానీ ఈ దోపిడీ ఎక్కడ లేదు? ఎవరు దోపిడీ చెయ్యటం లేదు? అవకాశం ఉన్న ప్రతి చోటా దోపిడీ చేస్తూనే ఉన్నారు. డాక్టర్లూ, ప్లీడర్లూ, లాయర్లూ దోపిడీ చెయ్యటం లేదా?

మొన్న జరిగిన పుష్కరాల్లో ఆటోవాళ్ళూ, రిక్షావాళ్ళూ, రోడ్డుపై సరుకులు అమ్మేవాళ్ళూ ఒకరేంటి? ప్రతివాడూ రైల్వేస్టేషన్లో ఎవరి చేతిలోనైనా కాస్త బరువైన సామానులుంటే 'అడ్డకు పడ్డా' వసూలు చేసే రైల్వేకూలీ దోపిడీ చెయ్యటం లేదూ? పిల్లా పాపలతో రోడ్డుమీద నిలబడితే రిక్షావాడో ఆటోవాడో అదును చూసి రేటు పెంచేయటం లేదూ? జీతాలు అందు కొన్ననాడు ఉద్యోగి అయిన భర్తను స్వంతభార్యే దోపిడీ చెయ్యటం లేదూ? ఇలా వ్రాస్తూ పోతే..' ఇందుగలడందులేదని' అన్నట్లు ఇది సర్వత్రా ఉంది.

సరే! ఏదో 'జపం విడిచి లొట్టల్లో పడ్డట్లు' ఆ కొబ్బరికాయ అయిదు రూపాయల కిస్తావా? అన్నట్లుగా అయిదు వేళ్ళూ విప్పి అరచేయి చూపాడు! వాడు తల ఎగరేసి ఇవ్వను పొమ్మ న్నాడు! ఇక తప్పదని కొబ్బరికాయ తీసుకుని పది రూపాయల నోటిస్తే మరొక రెండు రూపాయలు ఇమ్మన్నాడు. ఇది ఎందుకో అర్థంకాక ఏమిటన్నట్లు చూశాడు మునిశర్మ!.

'ఎందుకేమిటయ్యా? రెండు రూపాయలిస్తే అయిదు రూపాయల బిళ్ళ ఇస్తాను. ఇదొక మూగ గోల!" అంటూ విసుక్కున్నాడు. మునిశర్మకు చెంపదెబ్బ తిన్నట్లయింది. తనను 'మూగగోల' అన్నందుకు.

ఎలాగైతేనేం- వాడికి రెండు రూపాయ లిచ్చి అయిదు రూపాయల బిళ్ళ తీసుకుని గుడికి వెళ్లాడు. పురోహితుడు ఉంచిన పళ్ళెంలో కొబ్బరికాయ పది రూపాయల నోటుంచి పూజ చేయించమన్నట్లు సౌంజ్ఞ చేశాడు. ఆ పూజారి కొబ్బరికాయనూ, దక్షిణా తీసుకుని -

"అయ్యా! తమ గోత్రం పేరూ చెప్పండి! అష్టోత్తరం చేస్తాను" అన్నాడు.

తను ఎలా చెప్తాడు? తల ఊపి పూజ చెయ్యమన్నట్లు సౌంజ్ఞ చేశాడు. అదేమిటో అర్థంకాక ఆ పూజారి-

"సార్! తమ పేరూ గోత్రం చెప్పండి! పూజ చేస్తాను" అని ఎంతో వినయంగా మళ్ళీ అన్నాడు.

మునిశర్మకు ఎలా చెప్పాలో అర్థం కాలేదు. తన పేరు చెప్పాలి- 'భరద్వాజస' గోత్రం చెప్పాలి. కాని ఎలా? పూజారి దగ్గర కలం కాగితం లేవాయె! తాను మౌనం అని చెప్పటం కోసం రెండు పెదాలు దగ్గరగా ఉంచి చూపుడు వేలు నిలువుగా పెదాలుకి ఆనించి సౌంజ్ఞ చేశాడు. పూజారి తెల్లబోయి చూశాడు. ఇదేంటి? పేరూ, గోత్రం అడిగితే ఇదేదో తప్పువని అన్నట్లు నోటికి వేలు అడ్డం పెడతాడేంటి? అనుకున్నాడు. మునిశర్మకు ఆలోచన వచ్చి పూజారిని దగ్గరగా పిలిచి తన అరచేతి మీద గోత్రం పేరు రాసి చూపాడు. ఆ ముసలి పూజారికి ఈ చేతి మీద రాత ఎలా తెలుస్తుంది? ఆ పూజారి తనకు తెలిసిన గోత్రాల పేర్లు కొన్ని వల్లిస్తూ "విశ్వామిత్రా? వసిష్ఠా? గౌతమా? కాశ్యపా?" అంటూంటే ఇతడు అన్నింటికీ కాదు కాదు కాదు అనేలా తలూపాడు. ఇదేదో మూగ గోలలాగ ఉందనుకుని ఆ పూజారి కొబ్బరికాయ కొట్టి హారతిచ్చి ఇతడి వద్దకు వచ్చి హారతి చూసి కొబ్బరి చిప్పా, కొన్ని పూలూ చేతిలో పెట్టాడు. పూజారి మాత్రం ఏం చేస్తాడు? తన అసమర్థతను తిట్టుకుంటూ అవి తీసుకుని తిన్నగా ఇంటికి వచ్చేశాడు మునిశర్మ.


సాయంత్రం వరకూ అలాగే ఇంట్లోనే కూర్చున్నాడు. ఉపవాసం కదా! నీరసంగా ఉంది. కానీ ఎంతకని అలాగ ఇంట్లో గడుపు తాడు? బయటకు వస్తే ఏదోవిధంగా మాట్లా డాల్సి వస్తుంది. ఈ సంధ్యవేళ ఇంట్లో కూర్చో వటం అలవాటు లేదు. అందుచేత వీధిలోకి వచ్చి అలాగ ధవళేశ్వరం బ్యారేజి వద్ద కొత్తగా కట్టిన పార్కు వైపు బయలుదేరాడు. పార్కు వద్దకు వచ్చి ఒక మూల నిశ్శబ్దంగా కూర్చు న్నాడు.

అతడు కూర్చున్న కొద్దిసేపటికే ఒక యువ జంట చేతితో ఒక చిన్నపిల్లను నడిపించు కుంటూ వస్తున్నారు. ఆ చిన్నపిల్ల ఒక మూల కూర్చున్న మునిశర్మను వేలితో చూపుతూ "తాతయ్య! తాతయ్య!" అంటూ వాళ్ళను ఆ వైపుకు లాగింది. వాళ్ళు ఇటుగా వచ్చి ముని శర్మను చూడగానే ఆ యువకుడు ఆశ్చర్య పోతూ -

"అరె శర్మ మాష్టారా? నమస్కారం అండీ!" అంటూ తన భార్య వైపు తిరిగి "ఈయన మా శర్మ మాష్టారు. నేను 7వ తరగతి

## టబూ న్యూజిలాండ్ ప్రేమ!

**ట**బూ ఇప్పుడు న్యూజిల్యాండ్ యువకుడితో ప్రేమలో పడ్డట్టు ఆమె స్నేహితులు చెబుతు న్నారు. వివాద రహితురాలిగా పేరొందిన టబూ ఇప్పుడు న్యూజిలాండ్ ప్రియుడితో చెట్టా పట్టాలేసుకుని తిరుగుతుండడంతో ఇక త్వరలోనే బాలీవుడ్‌కి టబూ టాటా చెప్పనుందని సినీవర్గాల వ్యాఖ్య.



చదువుతుండగా ఆయన మా క్లాస్ టీచర్" అని ఆమెకు పరిచయం చేశాడు. ఆమె నమస్కరించింది.


ఆ శిష్యుడి నమస్కారం చిరునవ్వుతో స్వీకరించి వారిని కూర్చోమని సౌంజ్ఞ చేశాడు. ఆ శిష్యుడు తన భార్యనూ, చిరంజీవినీ పరిచయం చేశాడు. మునిశర్మ వారిని తన చేతులతో ఆశీర్వదించాడు. కానీ మాట్లాడలేదు. ఆ శిష్యుడికి ఈయన చర్య ఆశ్చర్యం వేసింది. ఏమిటీ ఈ మిత భాషిత్వం? ఎప్పుడూ గడగడ మాట్లాడే మాష్టారు అలా నిశ్శబ్దంగా ఉండటం చూసి, ఏవేవో ప్రశ్నలు వేశాడు. కానీ మాష్టారు ఎలా చెప్తారు? అఖరికి ఉండబట్టక తన మౌనం భంగం చెయ్యక తప్పలేదు. ఎన్ని సౌంజ్ఞలు చేసినా ఆ శిష్యుడికి అర్థం కావటం లేదు. అయోమయంగా మాష్టారు వైపు చూడసాగాడు. అందుకే మునిశర్మ మౌనం భంగం చెయ్యవలసి వచ్చింది. అసలు విషయం శిష్యుడితో చెప్పక తప్పలేదు.

మాష్టారు మౌనం భంగపరచినందుకు శిష్యుడు ఎంతగానో నొచ్చుకున్నాడు. పొరపాటయిందనీ క్షమించమన్నాడు. మునిశర్మ ఇంకేం అనలేక ఎలాగో మౌనభంగం అయింది కాబట్టి శిష్యుడితో పాత విషయాలు చర్చించాడు. చీకటి పడుతుండగా అందరూ లేచారు. శిష్యుడు శలవు తీసుకుని వెళ్ళిపోయాడు. మునిశర్మ ఇల్లు చేరుకున్నాడు.

రాత్రి భోజనం అయ్యాక అలా వాలుకుర్చీలో కూర్చుని ఆలోచించ సాగాడు. ఈ మౌనవ్రతం సాగించడం ఎలాగా అని! మొదటి రెండు వారాలూ ఏదో విధంగా భంగం అయింది. ఇక మూడవ సారైనా జాగ్రత్త పడాలి. అసలు మూగభాషను టి.వి.లో న్యూస్ చెప్తూ ఒకామె హావభావాల్తో చెప్తూం డేది. అది చూపినప్పుడు విసుగేసి టి.వి. కట్టేసే వారు. దాని అవసరం ఇప్పుడు కనిపిస్తోంది. అప్పుడే జాగ్రత్తగా ఆ సౌంజ్ఞలూ ఆ చేతులు తిప్పడాలూ నేర్చుకుని ఉంటే ఇప్పుడు పనికొచ్చును కదా! తనకి మూగభాష అర్థం కాదు. చెప్పనూ లేదు. మరి ఈ సమస్య తీరడం ఎలా? ఇలా ఆలోచిస్తూ ఆ రాత్రి నిద్రపోయాడు.

* * *

వారం గడిచిపోయి, మళ్ళీ ఆదివారం వచ్చింది. అప్పుడొక ఉపాయం తట్టింది. జేబులో చిన్న కాగితం స్లిప్పులూ, పెన్నూ ఎప్పుడూ ఉంచుకుంటే సరిపోతుంది కదా! ఇదే పరిష్కారం అనుకొని, కాగితాల్ని చిన్న స్లిప్పులుగా కత్తిరించి జేబులో పెట్టుకున్నాడు. అవసరమైతే రాసి చూపవచ్చు. ఇది భేష్! సరైన ఆలోచన! ఇది బాగానే ఉంది కానీ ఆ మర్నాడు సోమవారం ఉదయానికే తాను విశాఖపట్నంలో ఒక తప్పనిసరి కార్యక్రమానికి వెళ్లాలి. అది గుర్తొచ్చింది. సోమవారం ఉదయానికే వెళ్ళాలంటే ఈ రాత్రి బండిలో వెళ్ళాలి. రైల్లో జాగా దొరకదు. నిద్ర ఉండదు. అర్ధరాత్రి ప్రయాణం తనవల్ల కాదు. అందుకు ఈ సాయంత్రమే రాజమండ్రిలో రైలెక్కితే సరిపోతుంది! అనుకున్నాడు. సాయంత్రం నాలుగు గంటలకు రైలుంది. మధ్యాహ్నమే చిన్న సంచిలో రెండు బట్టలు వేసుకుని రిక్షా కోసం వీధిలోకి వచ్చాడు. బస్ స్టాప్ వరకూ నడవాలంటే ఇబ్బంది. రిక్షావాడు కనపడగానే ఆపి బస్ స్టాప్‌కి పోనిమ్మని చెప్పాలి. కానీ




వాడికెలా అర్థం అవుతుంది? ఇంతలో రిక్షా కనిపించగానే చెయ్యి ఊపి రమ్మన్నాడు. వాడు వచ్చి –

"ఎక్కడికి బాబయ్యా?" అని అడిగాడు. మునిశర్మ తన సంచి చూపాడు. "బస్ స్టాండ్‌కా " అన్నాడు. కాదు బస్ స్టాప్‌కి అని చెప్పాలి బస్ స్టాండ్ అయితే మళ్ళీ వెనక్కి పోవాలి. చాలా దూరం. కానీ అది వాడికెలా చెప్పాలి? సరేనని వాడి రిక్షాలోనే కూర్చుని జేబులోనున్న స్లిప్పు తీసి 'బస్ స్టాప్' అని రాసి చూపించాడు. వాడికేం అర్థం అవుతుంది? వాడు అది చూసి నవ్వుతూ –

"అంత సదువే వస్తే ఈ రిక్షా లాగుకునేవాడినా బాబూ!" అన్నాడు. మళ్ళీ "సరే కూకోండి. తోవలో ఎవరికైనా సూపిద్దాం" అని ఉపాయం చెప్పాడు. ఇంతలో కిళ్ళీకొట్టు వైపు నుంచి ఒకతను చుట్ట తాగుతూ వస్తున్నాడు. అతడ్ని ఆపి స్లిప్పు చూపాడు. అతడూ చదువుకోలేదేమో! అర్థంకాక ఆ ఎదురుగానున్న మందుల షాపువాడ్ని అడగమన్నాడు. తాను రిక్షా దిగి రిక్షావాడ్ని వెంటబెట్టుకొని మందులషాపతనికి ఆ స్లిప్పు చూపాడు. ఆ షాపువాడు అదేదో మందుచీటీ అనుకుని చదివాడు. తర్వాత నవ్వుకొని ఆ రిక్షావాడితో బస్ స్టాప్ వద్ద అతన్ని దింపమని చెప్పాడు.

ఎలాగైతేనేం రిక్షా దిగి డబ్బులిచ్చి బస్సు రాగానే ఎక్కాడు. కండక్టరు చేతిలో నాలుగు రూపాయలు పెట్టి తన సంచి చూపాడు. ఆ కండక్టరుకు ఇతని బాధ సరిగానే అర్థం అయింది.

"రైల్వే స్టేషనుకా?" అన్నాడు కండక్టరు. మునిశర్మ అవునన్నట్లు తలూపాడు. ఆ విధంగా స్టేషనుకు వచ్చి పడ్డాడు.

ముందుగానే స్లిప్పు మీద 'విశాఖపట్నం' అని రాసి ఉంచుకున్నందువల్ల ఆ స్లిప్పును బుకింగ్ కౌంటర్లో ఇవ్వటంతో ఏ సమస్యా లేకుండానే టిక్కెట్టు దొరికింది. రైలు రాగానే ఎక్కాడు. "బ్రతుకు జీవుడా!" అనుకొని ఖాళీ జాగా వెతుక్కుని ఒక బెంచి మీద కూర్చున్నాడు. ఎదురుగా బెంచీ మీద ఒక మామ్మగారూ, భర్తా కూర్చున్నారు. ఆ రోజు సాయంత్రం స్టేషనుకు చేరుకొనే హడావుడిలో కాఫీ అయినా తాగలేదు. రైలు ఇంకా రాజమండ్రి స్టేషను వదలలేదు. తను కూర్చున్న జాగాకి కిటికీ కొంచెం ప్రక్కకు ఉంది. కాఫీ వాడ్ని పిలవాలి. కాని ఎలా? పోనీ దిగి వెళ్ళి

తాగి వద్దామంటే బండి కదిలిపోతుందేమో! అని బెంగ. అటూ ఇటూ తెగ చూశాడు మునిశర్మ. ఇంతలో కాఫీ అమ్మేవాడే "కాఫీ కాఫీ" అని అరుచుకుంటూ ప్లాట్‌ఫారం మీద నుంచి వెళ్తున్నాడు. ఆ వైపు కిటికీ దగ్గరే మామ్మగారున్నారు. ఆమెకు అర్థమయ్యేలాగ కాఫీ కావాలంటూ సౌజ్ఞ చేశాడు. ఆమె వెంటనే కాఫీ అమ్మేవాడ్ని కేకవేసి కాఫీ తీసుకుని మునిశర్మకు అందించింది. ఆమెకు పది రూపాయల నోటివ్వగా వాడి దగ్గర చిల్లర తీసుకుని మునిశర్మకిచ్చింది ఆ మామ్మగారు. "ధన్యోస్మి!" అనుకున్నాడు. అలా అయింది మామ్మగారితో మూగ పరిచయం.

ఆ మామ్మగారిని ఇతడు మౌనం అని తెలియదు కదా! ఏదో సౌజ్ఞ చేస్తే మామూలుగానే అనుకుని కాఫీవాడ్ని పిలిచి కాఫీ ఇచ్చింది. ఇంతలో రైలు కదిలింది. రాజమండ్రి స్టేషను దాటింది. మునిశర్మ సర్దుకుని స్థిరంగా కూర్చున్నాడు. కాఫీ తాగటంతో అంతవరకూ ఉన్న చిరాకు తగ్గింది. ఆ మామ్మగారు ఇతడి వైపే దీక్షగా చూస్తూ, ఇష్టాగోష్ఠి ప్రారంభించింది. ఎక్కడికి వెళ్తున్నారని అడిగింది. మునిశర్మ తర్జనితో రైలు వెళ్తున్న వైపే చేయి చాపి చూపాడు.

"ఓహో! మీరూ విశాఖపట్నమేనా?" అంది. తనకు అర్థమైనట్లు! అతను తల ఊపాడు. ఈతడు మితభాషి కాబోలు అనుకుందావిడ! మునిశర్మను చూస్తే- 'ఈతడు మనవాడిలాగే ఉన్నాడే? అనుకుని ఇంటిపేరూ, ఊరిపేరూ, బంధుత్వాలూ అడగడం ప్రారంభించింది. ఏం చేస్తాడు అలా వినటం, తలూపటం తప్ప ఏమీ చెయ్యలేక పోతున్నాడు. ఆమె అలా ప్రశ్నల వర్షం కురిపిస్తూనే ఉంది. ఇక లాభం లేదనుకుని జేబులోంచి స్లిప్పూ, పెన్నూ తీసి తన పేరూ, ఇంటి పేరూ, ఊరూ, విశాఖపట్నంలో ఎక్కడికి వెళ్తున్నదీ ఆ వివరాలన్నీ వ్రాసి ఆమె చేతిలో పెట్టాడు. ఆమె ఈ స్లిప్పు చూసి నిర్ఘాంతపోయింది! చదువుదామంటే కళ్ళజోడు సూట్‌కేసులో ఉండిపోయింది. అందుచేత ప్రక్కనే కునుకు తీస్తున్న భర్తను లేపి-

"ఈ కాగితం ఏమిటో చదవండి! ఆ ఎదురుగా ఉన్నాయన రాశారు. పాపం! మూగ కాబోలు! నోరు లేదు- మనిషి చూడండి! ఎంత నీటుగా ఠీవిగా ఉన్నారో! ఎక్కడో మంచి ఉద్యోగం చేసిన వారిలాగే ఉన్నారు - బాగా

## గురుదేవో మహేశ్వరః
# మీ సమస్యలకు పరిష్కారాలు
### వేమనారాధ్యస్వామి

***నాకు వివాహం అవుతుందా? నా మానసిక ఆవేదన, ఆర్థిక ఇబ్బందులు ఎప్పుడు తీరుతాయి?***

**- వేముల అనంతరెడ్డి, కరీంనగర్**

మీ వివాహ సమస్య ఈ సంవత్సరం పరిష్కారం అయ్యే సూచన ఉన్నది. ఈ సంవత్సరం కాకపోతే ఆలస్యమౌతుంది. వివాహానంతరం నుంచీ అన్ని సమస్యలకు నిదానంగా పరిష్కారాలు దొరుకుతాయి.

**ఈ శీర్షికకు ప్రశ్నలను పంపేవారు, తమ పేరు, చిరునామా, పుట్టిన తేదీ, సమయం, నక్షత్రం, నివసించే ప్రాంతం వివరంగా రాసి మాకు పంపండి. వారం వారం మీ ప్రశ్నలకు వేమనారాధ్యస్వామి గారు ఉపాసనాబలంతో సమాధానాలు చెబుతారు.**

**- ఎడిటర్**

చదువుకున్నట్లే వుంది! పాపం! మధ్యలో మాటపోయినట్లుంది! ఆయనకు భార్య ప్రక్కనే ఉంటే కొంత సులువు అయ్యేది! అసలు ఆయనకు భార్య కూడా ఉందో లేదో? భార్య లేకపోతే ఆయన ఈ మూగ గొంతుతో ఎన్ని అవస్థలు పడుతున్నారో? అంతా విధి వ్రాత!... ఆ భగవంతుడు కొందరికి అన్నీ ఇచ్చినా ఏదో ఒక వంక పెడతాడు! లేకపోతే ఈ మానవులు అతడ్ని తలచుకుంటారా?" ఇలా ఏకధాటిగా వల్లిస్తూ భర్తను గట్టిగా కుదిపి లేపింది! అతడు ఇంకా అర్ధ నిమీలిత నేత్రాలతోనే చూస్తూండటంతో-

"అయ్యో! ఖర్మ ఇంకా నిద్రేనా? ఈ చీటీ ఏమిటో చూడండీ? అందులో ఆయన వివరాలు ఉన్నట్లుంది చదవండి!" అంది పెద్ద గొంతుతో.

అతడు గాభరాగా కళ్ళు విప్పి- "ఏమిటీ?" అన్నాడు. ఆమె అతడి చెవిలో గట్టిగా- "ఇంత అరుస్తున్నా వినపడలేదా?... మీ చెవుడు బంగారం గానూ! ఈ చీటీ చదవండి, ఆయన గురించి రాశారు కాబోలు!" అంది.

అతడు కళ్ళజోడు సవరించుకుని ఆ చీటీ దగ్గరగా పెట్టి చదివాడు. అది చదివి తన భార్యతో-

"ఓహో! ఈయన ఎవరో కాదే! మన రెండో కోడలు 'రత్నం' లేదూ? వాళ్ల వేలు విడిచిన మేనమామ! మేష్టరీ చేస్తూండేవారు కదా!"- అంటూ మునిశర్మవైపు చూసి పలకరింపుగా నవ్వారు. మునిశర్మ కూడా ఒక వెర్రినవ్వు నవ్వాడు!

"ఇంతకీ మీరు రిటైరయి ప్రస్తుతం ఎక్కడున్నారు? పాపం! మీ ఆవిడ పోయిందట కదా! ఆమె ఎవరో కాదు- మా స్వయాన పినతల్లి ఆడపడుచు కూతురే! కాకినాడ కదూ?" అన్నారు ఆ ముసలాయన.

మునిశర్మకు ముచ్చెమటలూ పోశాయి. ఏదో చెప్పాలని ఉంది. కాని చెప్పలేడు! వెర్రిముఖం వేసుకుని అతడివైపు చూశాడు! ఆ ముసలాయన తన భార్యతో-

"ఈయన మన రెండోవాడి పెళ్ళిలో ఎంత చక్కగా పద్యాలు చదివారో!" అన్నారు.

ఆ ముసలమ్మగారు విచారిస్తున్నట్లు నిట్టూరుస్తూ- "ప్చ్! అంతా ప్రారబ్ధం అండీ! అంత చక్కని గొంతూ, ఆ వాగ్ధాటీ ఉన్న మనిషికి ఆ భగవంతుడు మాట లేకుండా చేశాడు! అంతే! మనం ఏమీ చెప్పలేం, ఏనాడు, ఎవరికి, ఏమి జరుగుతుందో? అంతా భగవద్విలాసం!" అంటూ మరోసారి విచారించి కిటికీ వైపు చూడసాగింది.

మునిశర్మకు ఆత్మహత్య చేసుకోవాలన్నంత దుఃఖం, సిగ్గూ కలిగాయి! "నాకు గొంతు వుంది మొర్రో!"- అని అరవాలనిపించింది! కాని అరవలేడు! మౌనం! ఇక అక్కడ ఉండలేక సంచీ తీసుకుని వాళ్ళకు దూరంగా మరొక జాగాకు వెళ్లిపోయాడు!

ఆ దంపతులిద్దరూ అతడి వైపు జాలిగా చూశారు!

*